క్లుప్తంగా

ఆక్రమణపై చర్యలు తీసుకోండి

నెల్లూరురూరల్ : పట్టణంలోని ఫత్తేఖాన్‌పేటలో డొంకబడి మున్సిపల్ పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికుడు సునీల్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. పాత మున్సిపల్ పాఠశాల స్థల ఆక్రమణపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

డయల్ యువర్ డీఎం-2 నేడు

నెల్లూరు సిటీ : ప్రయాణికుల సూచనలు, సలహాల కోసం డయల్ యువర్ డీఎం-2 కార్యక్రమం గురువారం ఉంటుందని డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 25642 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కవితా వైభవంపై ఉపన్యాసం నేడు

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో గురువారం 'పోతన భాగవతం.. కవితా వైభవం' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం జరుగనుందని నిర్వాహకుడు డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వై.శేషగిరీశం బుధవారం తెలిపారు. వక్తగా తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ అధ్యాపకుడు డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ వ్యవహరించనున్నారు.

జర్నలిస్ట్ సంఘాల ఆందోళన



క్యాండిల్స్‌తో నిరసన చేస్తున్న జర్నలిస్టులు

నెల్లూరు(బారకాసు) : సినీ నటుడు మోహన్‌బాబు మీడియా ప్రతినిధిపై దాడిని ఖండిస్తూ జర్నలిస్టులు బుధవారం రాత్రి నగరంలో ఆందోళన చేపట్టారు. గాంధీబొమ్మ సెంటర్‌లో క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్(ఏపీజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి శేఖర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మోహన్‌బాబుపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా మండల పూజలు



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి మండల పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. భక్తులు విశేషంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి- స్నేహలత, బట్టేపాటి రంగారెడ్డి- అషిత దంపతులు, వెంకటేష్, సందీప్‌లు వ్యవహరించారు. కార్యక్రమాలను సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, ప్రసాద్ పర్యవేక్షించారు.

జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అర్జున్‌నాయక్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అర్జున్‌నాయక్‌ను ప్రభుత్వం నియమించింది. అందుకు సంబంధించిన జీఓఆర్‌టీ నంబర్ 7ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయన ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై నెల్లూరు రానున్నారు.

నగరం.. గోతులమయం

- అధ్వానంగా రహదారులు
- అధికమవుతున్న ప్రమాదాలు
- ప్రజలకు తప్పని తిప్పలు

ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అన్ని ప్రధాన రహదారులు ప్రమాదకరంగా మారాయి. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి అనేక సందర్భాల్లో ప్రజలు గాయాలపాలవుతున్నారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– నెల్లూరు(బారకాసు)



డైకస్‌రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గుంత



వాహనదారుడి పాట్లు

⇨ పొదలకూరు రోడ్డులో అడుగడుగున గుంతలతో పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ రహదారి మీదుగా పొదలకూరు, రాపూరు, సోమశిల ప్రాంతాల వైపు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వారు నరకం అనుభవిస్తున్నారు. ఓ వైపు ఒళ్లు గుల్లవుతుంటే మరోవైపు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

⇨ డైకస్‌రోడ్డు కూడలిలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వేదాయపాళెం ప్రాంతంలోని జీఎన్‌టీ రోడ్డులో ఏర్పడిన పెద్ద గుంత వల్ల వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో వర్షం కురిస్తే పరిస్థితి మరీ అధ్వానంగా మారుతోంది.

⇨ గాంధీనగర్ రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటిని తప్పించబోయి అనేక మంది ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

⇨ ప్రశాంతినగర్ నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో అతి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇక్కడ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

⇨ ఎన్టీఆర్ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ నుంచి హైవే వైపునకు వెళ్లే సిమెంట్ రోడ్డు కుంగిపోయాయి. ఈ రోడ్లలో రాత్రిపూట ప్రయాణించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు.

⇨ రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్లు వేసినా కొద్ది కాలానికే దెబ్బతింటున్నాయి. ఇందుకు కారణం నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడమేనని నగర ప్రజలు అంటున్నారు.

నరకమే



నగరంలోని రోడ్లన్నీ గుంతలమయమైంది. దీనివల్ల ప్రయాణం నరకంగా ఉంది. అంతేకాకుండా బైక్‌లు మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి రోడ్లు వేస్తే బాగుంటుంది.

– సుబ్బారెడ్డి, బంగ్లాతోట

నాలుగు సార్లు గాయపడ్డా



నగరంలోని ప్రధాన రహదారుల్లో అడుగుకో గుంత ఉంది. నేను ఇప్పటికే నాలుగు సార్లు గుంతల రోడ్లపై ప్రమాద బారిన పడ్డా. వర్షాకాలంలో ఎక్కడ గుంత ఉందో తెలియక గాయపడుతున్నాం. పాలకులు, అధికారులు దృష్టి సారించాలి. రోడ్లు బాగు చేయాలనే దానిపై దృష్టి పెడితే ఎంతో మేలు.

– వసంత్‌కుమార్, కావేరినగర్

దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(అర్బన్) : స్థానిక బాలాజీనగర్‌లోని గీతామయి బాలభవన్ వద్ద వృద్ధులు, బాలింతలకు ప్యూర్ స్మైల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు పర్వీన్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రతినెలా చేపట్టే సేవా కార్యక్రమంలో భాగంగా వీటిని అందించామన్నారు. బాలభవన్ ఫౌండర్ పాండు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 33/11 కేవీ శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను మారుస్తున్నందున పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్టీ మారి విమర్శలు చేయడం తగదు

- ఆప్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు



నెల్లూరు(బారకాసు) : గత వైఎస్సార్‌సీపీ హయాంలో పదవులు అనుభవించి, ఇప్పుడు పార్టీ మారి విమర్శలు చేయడం పద్ధతి కాదని, ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఆప్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత స్థానం కల్పించిన నాయకుడు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. నగరంలోని రాజన్న భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఆరు నెలలు పూర్తయినా మత్స్యకారుల భరోసాపై కాలయాపన చేయడం సమంజసం కాదన్నారు. మరో నెల రోజుల్లోపు మత్స్యకార భరోసాను జమ చేయకపోతే నిరసనలు తెలియజేస్తామన్నారు. కొందరు పెద్ద మనుషుల ముసుగులో రాజ్యసభ నామినేషన్ దాఖలు చేసి బీసీలకు పెద్దదిక్కు టీడీపీ అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే నోటితో గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జ్యోతిరావు పూలేతో పోల్చిన విషయాన్ని గుర్తుచేశారు. బీద మస్తాన్‌రావు రాజ్యసభ కోరిక నెరవేర్చింది వైఎస్ జగన్ కాదా అని ప్రశ్నించారు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేయాలన్న ఆలోచనతో గతంలో బీద మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణ, ఆర్.కృష్ణయ్యలను రాజ్యసభకు పంపిస్తే ఇప్పుడు పార్టీ మారడం వెన్నుపోటు కాదా అని నిలదీశారు.

13 నుంచి పోలీస్ స్పోర్ట్స్ మీట్

నెల్లూరు(క్రైమ్) : జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ఈనేల 13 నుంచి 15వ తేదీ వరకు నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో జరుగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 300 మందికిపైగా క్రీడాకారులు స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొననున్నారు. అధికారులు అందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. అయితే ఆయా రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో స్పోర్ట్స్‌మీట్ వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇద్దరు దొంగల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను దర్గామిట్ట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. యనమల బావి సంఘంలో గతనెల 23న రాత్రి నరేష్ అనే వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు ఒకటిన్నర సవర బంగారు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. రామ్‌నగర్‌లో ఈనెల 2వ తేదీ రాత్రి గౌస్‌బాషా ఇంట్లో ల్యాప్‌టాప్, ట్యాబ్ చోరీకి గురైంది. ఇరు బాధితుల ఫిర్యాదుల మేరకు దర్గామిట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రోశయ్య నేతృత్వంలో ఎస్సై రమేష్‌బాబు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నిందితులు గూడూరు ఇందిరానగర్‌కు చెందిన పాతనేరస్తుడు డేవిడ్, గాంధీనగర్‌కు చెందిన రాజేష్‌లుగా గుర్తించి గాలింపు చేపట్టారు. పొదలకూరు రోడ్డు వద్ద బుధవారం నిందితులను అరెస్ట్ చేసి ల్యాప్‌టాప్, ట్యాబ్, ఒకటిన్నర సవర బంగారు, 29 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటికే పలు కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

కృష్ణమందిర పునర్నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెం గాంధీనగర్‌లోని కృష్ణమందిరం పునర్నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. తొలుత భూమి పూజ గావించారు. కార్యక్రమంలో నిర్మాణ దాతలు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

వ్యర్థాలు లేకుండా పర్యవేక్షించండి

- కమిషనర్ సూర్యతేజ



వాటర్ ట్యాంక్ విషయమై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : ప్రధాన మార్గాలకు ఇరువైపులా ఉన్న బహిరంగ ప్రదేశాల్లో స్థానికులు వ్యర్థాలు వేయకుండా, ఇప్పటికే ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించేలా అధికారులు పర్యవేక్షించాలని నగరపాలక కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక ఒకటో డివిజన్ కోడూరుపాడు ప్రాంతంలో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు అవసరమైన వాహనాలను వెంటనే సమకూర్చాలని అధికారులను సూచించారు. అదేవిధంగా డివిజన్ వ్యాప్తంగా రోడ్లపై ఉన్న గోతులను మరమ్మతులు చేసేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను తెలియజేశారు. అలాగే స్థానికంగా నిర్మించి ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను కమిషనర్ పరిశీలించారు. మెగా ఇంజినీరింగ్ కంపెనీ నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును ఇప్పటివరకు నగరపాలక సంస్థకు అప్పగించలేదని, వీలైనంత త్వరగా ప్రజలకు తాగునీటి కుళాయి కనెక్షన్లు అందించి వాటర్ ట్యాంకును ఎన్‌ఎంసీ ఆధీనంలోకి తీసుకుని నిర్వహించాలన్నారు. భారీ స్థాయిలో వ్యర్థాలను తరలించే కాంపాక్ట్ వాహనాలను క్రమం తప్పకుండా పనిచేసేలా సిబ్బందిని పర్యవేక్షించాలన్నారు. అలాగే స్థానిక గాంధీనగర్ రోడ్డు, కరెంటాఫీస్ సెంటర్ ప్రధాన రోడ్లపై జరుగుతున్న ప్యాచ్ వర్క్ పనులను పర్యవేక్షించారు. నగర వ్యాప్తంగా ప్రధాన రోడ్లపై జరుగుతున్న మరమ్మతుల పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం గాంధీనగర్ మున్సిపల్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను, లేఅవుట్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీధిలైట్లను, సంతపేటలోని పాతమార్కెట్‌ను తనిఖీ చేశారు.

అన్నదాతకు అండగా నిలుస్తాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- భారీగా తరలిరావాలని పార్టీ శ్రేణుల పిలుపు

నెల్లూరు(బారకాసు) : అన్నదాతలకు న్యాయం జరిగేలా వారికి అన్నివిధాలా అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్‌అహ్మద్ అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 13న ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా నగరంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచనల మేరకు రాంజీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పేరుతో రూపొందించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందన్నారు. రైతులు పెట్టుబడి సాయం లేక, ధాన్యానికి మద్దతు ధర అందక అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.13,500 అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. ఈనెల 13న చేపట్టే ధర్నా కార్యక్రమానికి రైతులు, ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఊటుకూరు నాగార్జున, నీలి రాఘవరావు, కరిముల్లా, జయలక్ష్మి, పార్టీ నాయకులు హంజా హుస్సేనీ, పేర్నేటి కోటేశ్వరరెడ్డి, మాబాషా, అలీం, సిద్ధిఖ్, శేషసాయి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పునాది బలంగా ఉంటే అద్భుతాలు



మాట్లాడుతున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు (టౌన్) : చిన్నారులు 1, 2 తరగతుల్లో భాష, గణితం పరంగా పునాది బలంగా ఉంటే అద్భుత ఫలితాలు సాధిస్తారని డీఈఓ బాలాజీరావు తెలిపారు. వెంకటాచలం మండలం గొలగమూడి సమీపంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో ఈనెల 14వ తేదీ వరకు జరిగే ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణలో అందిస్తున్న సూచనలను ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో అమలు చేసి 2026–27 నాటికి (మూడో తరగతి పూర్తయ్యేనాటికి) ప్రతి విద్యార్థి ఆయా తరగతులకు సంబంధించిన అభ్యసనా ఫలితాలను సాధించే విధంగా కృషి చేయాలన్నారు. సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓ మధుసూదన్, రీసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి



నెల్లూరు(బృందావనం) : మినీబైపాస్‌రోడ్డు ఇస్కాన్ సిటీలో ఉన్న 'ఇస్కాన్' మందిరంలో గీతా జయంతిని (మోక్షద ఏకాదశి) బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిర అధ్యక్షుడు డాక్టర్ శుకదేవ స్వామి ఆధ్వర్యంలో 18 అధ్యాయాల గీతా పారాయణం, గీతా ప్రవచనం, గీతా హోమం జరిపించారు. ఈ సందర్భంగా కొత్త సంవత్సర క్యాలెండర్‌ను, డాక్టర్ శుకదేవస్వామి రచించిన 'సనాతన ధర్మం.. మానవత్వం.. దైవత్వానికి దారి' పుస్తకాన్ని, రథయాత్ర ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. భక్తులకు భగవద్గీత గ్రంథాన్ని అందజేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి కీర్తనలు, భజనల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుకదేవస్వామి ఉపన్యసించారు.

డీకేడబ్ల్యూలో వర్క్‌షాప్



ఉషారాణిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నాన్ వెర్బల్ క్యూస్ అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాపును బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ గిరి పాల్గొని కమ్యూనికేషన్ రంగంలో నాన్ వెర్బల్ క్యూస్ ఆవశ్యకతను వివరించారు. అనంతరం కాళహస్తి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు ఎం.ఉషారాణి విద్యార్థులకు నాన్ వెర్బల్ క్యూస్ గురించి వివిధ యాక్టివిటీస్‌లను నిర్వహించి ఆంగ్లంపై ఆసక్తిని కలిగించారు. అనంతరం ఉషారాణిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల అధ్యాపకులు విద్యావళి, వైస్ ప్రిన్సిపాల్ రమణారావు, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మహేశ్వరి, తమన్నా, రీసోర్స్ అసిస్టెంట్లు లహరి, అమూల్య పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కమిషనర్ సూర్యతేజ



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ అన్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగం, నగరపాలక హెల్త్ విభాగాల సంయుక్తంగా కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్ల నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హోటళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా కిచెన్ ప్రాంతంలో అత్యంత పరిశుభ్రత ఉండాలన్నారు. వెజ్, నాన్‌వెజ్ ఆహారాలు విడివిడిగా ఉంచుకోవాలన్నారు. నిల్వ ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచరాదన్నారు. ఆహార తయారీలో నిబంధనలు తప్పక పాటించాలన్నారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ అధికారి జి.వెంకటేశ్వరరావు, అదనపు కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు పాల్గొన్నారు.

పశువులను గోశాలకు తరలిస్తాం



మాట్లాడుతున్న వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్

నెల్లూరు(బారకాసు) : ప్రధాన రోడ్లపై సంచరించే అన్ని పశువులను తప్పనిసరిగా గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్ అన్నారు. ఈ మేరకు ఆయన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్రంకురోడ్డు ప్రాంతంలో బుధవారం పశువుల యజమానులతో మాట్లాడారు. రోడ్లపై పశువులు సంచరించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోక తప్పదన్నారు. పశువులను యజమానులు వాళ్ల ప్రాంగణాల్లోనే ఉంచుకోవాలని, రోడ్లపై వదిలితే గోశాలకు తరలిస్తామని తెలిపారు.